సాక్షి తిరుపతి

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



ఆడుదాం రండి!

ఆడుదాం ఆంధ్రాకు సర్వం సిద్ధమైంది. ఈనెల 26 నుంచి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నారు.

- 8లో



వైకుంఠ రద్దీ

వైకుంఠ ద్వార దర్శన టిక్కెట్ల కోసం భక్తులు బారులు తీరారు. తిరుపతిలోని కౌంటర్ల వద్ద కిక్కిరిసిపోయారు.

- 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

- 8లో

న్యూస్‌రీల్

ముగిసిన చెకుముకి పరీక్ష



జ్ఞాపికలు అందజేస్తున్న టీటీడీ డీఈఓ భాస్కర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్‌లో చెకుముకి మండల స్థాయి సైన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు అర్బన్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పరీక్షలో పాల్గొననున్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు, పుస్తకాలను అందజేశారు. టీటీడీ డీఈఓ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ బాలాజీ, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24న చిత్రలేఖనం పోటీలు



రామకృష్ణ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద

తిరుపతి కల్చరల్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా భారతీయ యువజనోత్సవాల్లో భాగంగా రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఈ నెల 24వ తేదీన విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. గురువారం ఆశ్రమంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని పాఠశాల, కళాశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆశ్రమంలో 24న తుది చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు జనవరి 12న ఆశ్రమంలో నిర్వహించే స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

చదువుతోపాటు ఉద్యోగ నైపుణ్యాలు అవసరం

తిరుపతి ఎడ్యుకేషన్: డిగ్రీ విద్యార్థులకు అకడమిక్ చదువుతోపాటు ఉద్యోగ నైపుణ్యాలు ఎంతో అవసరమని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ తెలిపారు. కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం ఆ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని, మాట్లాడారు. చదువుతోపాటు ఉద్యోగ నైపుణ్యాలపై దృష్టి సారించినప్పుడే డిగ్రీతో పాటు ప్లేస్‌మెంట్స్‌లో సులువుగా ఉద్యోగం సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. కౌటిల్య డైరెక్టర్ ఎస్.శ్రీధర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేగవంతంగా పంట నమోదు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పెళ్లకూరు: రబీలో రైతులు సాగు చేసిన పంటలకు ఈ– క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి డాక్టర్ ప్రసాద్‌రావు అన్నారు. గురువారం ఆయన ఎగువచావలి గ్రామంలో ఈ– క్రాప్ నమోదును పరిశీలించి, రైతులతో చర్చించారు ఆర్బీకేలో పంపిణీ చేస్తున్న రాయితీ ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట నమోదుతో కోతదశలో పంట నష్టం వాటిల్లితే నష్ట పరిహారం అందుతుందన్నారు. అలాగే సున్నావడ్డీ, పంట రుణాలు, ధాన్యం కొనుగోలు తదితర ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ధనుంజయరెడ్డి, ఏఓ ప్రవీణ, వీఏఏలు మణి, చందు పాల్గొన్నారు.



రక్తదాతలతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి



తోపుడు బండ్ల ర్యాలీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



శ్రీకాళహస్తిలో పంపిణీ చేసిన తోపుడు బండ్లు

జగనోత్సాహం!

జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఊరూవాడా ఏకమై అభిమానులు పెద్ద సంఖ్యలో కదిలివచ్చారు. వాడవాడలా సేవా కార్యక్రమాలు మిన్నంటించారు. ఆత్మీయ నేత జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు యువకులు రక్తదానం చేసి రోగులకు అండగా నిలిచారు. నిరాశ్రయులైన వృద్ధులు, ఆస్పత్రుల్లోని రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. కేక్‌లు కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. 'జయహో జగన్.. వన్స్‌మోర్ జగనన్నా' అంటూ అభిమానులు నినదించారు.

- ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు
- వాడవాడలా మిన్నంటిన సేవా కార్యక్రమాలు
- మార్మోగిన 'వన్స్‌మోర్ జగనన్నా' నినాదాలు
- జయహో జగన్ అంటూ తరలివచ్చిన అభిమానులు

సాక్షి, తిరుపతి: జిల్లాలో పండగ వాతావరణం కనిపించింది. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుపతిలో నగరంలో టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో 115 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రక్తదానం చేశారు. రుయాలో రోగులకు పండ్లు పంపణీ చేశారు. చంద్రగిరిలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో 338 మంది రక్తదానం చేశారు. కేసీ పేటలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, తట్టలో పూలు విక్రయించే వారు వంద మందికి గొడుగులు, 15 మందికి బంకులు, 50 మంది నాయీ బ్రాహ్మణులకు కిట్లు, 100 మందికి జంగమదేవర్లకు కిట్లు పంపిణీ చేశారు. సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో అన్నదానం, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంతురెడ్డి ఆధ్వర్యంలో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో అన్నదానంతోపాటు పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వెంకటగిరిలో జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటగిరి, డక్కిలి, రాపూరులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గూడూరులో ఎమ్మెల్యే వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆస్పత్రుల్లో రక్తదాన శిబిరాలు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఢిల్లీలోని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



జంగమదేవర్లకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కిలివేటి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి



ట్యాబులు అందుకున్న విద్యార్థులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



కేక్ కట్ చేస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం



రక్తదాన శిబిరంలో గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

వైకుంఠ శోభితం



ఆలయం వద్ద సుందరమైన ఆర్చ్



భక్తులకు స్వాగత సప్తద్వారాలు

- తుమ్మలగుంటలో వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు



కల్యాణ వెంకన్న ఆలయం వద్ద రంగవల్లులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయం వైకుంఠ ఏకాదశికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వవిప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంతో పాటు గ్రామంలో ఇప్పటికే విద్యుద్దీపాలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఆలయంలో విశేష పుష్పాలంకరణ, పచ్చని తోరణాలతో సరికొత్త శోభను సంతరించుకుంది. ఆలయ పరిసరాలను అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. పెద్ద సంఖ్యలో భక్తులు తుమ్మలగుంటకు వచ్చే అవకాశం ఉండడంతో ఆలయం వద్ద పటిష్ట క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి వైకుంఠ ద్వారం ప్రారంభించనున్నారు. వైకుంఠ ద్వార దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఆలయ వస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పల్లి పోలీసులు ఇప్పటికే బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

రేపు పెంచలకోనలో వైకుంఠ ఏకాదశి

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచలకోన క్షేత్రంలో శ్రీవారిని దర్శించేందుకు ఉత్తర ద్వారం ఉన్నా, వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ఉత్తర ద్వార దర్శనం కోసం బంగారు రంగుతో కూడిన ద్వారాల ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందులో బంగారు గరుడవాహనంపై స్వామివారిని కొలువుతీర్చనున్నట్లు తెలిపారు. ఉదయం 3 గంటలకు అభిషేకం, 5 గంటలకు పూలంగిసేవ, ఉత్తర ద్వార దర్శనం , ఉదయం 8 గంటలకు గోనుపల్లెలో గరుడ సేవ, గ్రామోత్సవం, సాయంత్రం 6 గంటలకు బంగారు గరుడ వాహనంపై స్వామివారి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

'హీరో' సేవలు అభినందనీయం



రెవెన్యూ అధికారులకు హీరో హోండా స్కూటర్ తాళాలు అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: తిరుపతి నగరానికి వస్తున్న వీఐపీలకు సేవలందించడానికి హీరో కంపెనీ వారు రెవెన్యూ ఉద్యోగులకు 10 గ్లామర్ బండ్లు అందించడం అభినందనీయమని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతగా హీరో మోటార్ కంపెనీ వారు 10 ద్విచక్ర గ్లామర్ వాహనాలను కలెక్టర్ చేతుల మీదుగా రెవెన్యూ ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది ప్రోటోకాల్ విధులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హీరో మోటార్ ద్విచక్ర వాహనాల కంపెనీ ప్లాంట్ హెడ్ కిరణ్‌కుప్లా మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 235 హీరో మోటార్ బైక్‌లను కలెక్టరేట్, పోలీస్ యంత్రాంగానికి అందజేసినట్టు వెల్లడించారు. హీరో మోటార్ కంపెనీ, ఏయిర్ బైపాస్ రోడ్డు ఎండీ పృథ్వీ, బ్రాంచ్ మేనేజర్ బిందు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం రండి!

26 నుంచి ఆడుదాం ఆంధ్ర
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా భారీ ఎత్తున క్రీడా సంబరాలు
- 15 ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులు పాల్గొనవచ్చు
- ఇప్పటివరకు జిల్లాలో 1,50,280 మంది పేర్ల నమోదు
- విజేతలకు భారీగా నగదు బహుమతులు



వాలీబాల్, క్రికెట్ బ్యాట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ (ఫైల్)

తిరుపతి ఎడ్యుకేషన్: క్రీడా పోటీల నిర్వహణకు రాష్ట్రం సన్నద్ధమైంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మెగా ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈనెల 26న సీఎం చేతుల మీదుగా ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించనున్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ (డబుల్స్) క్రీడల్లో పోటీలు ఉంటాయి. ఇవే కాకుండా టెన్నికాయిట్, యోగా, 2కే రన్ పోటీలను నిర్వహిస్తున్నప్పటికీ అధికారికంగా ఐదు క్రీడల్లోనే పోటీలు సాగుతాయి. ముందుగా గ్రామ, పట్టణ వార్డు, సచివాలయ పరిధిలో పోటీలుంటాయి. అక్కడ గెలుపొందిన విజేతలు మండల స్థాయి, అక్కడి నుంచి నియోజకవర్గ స్థాయి, తరువాత జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలలో తలపడుతారు.

భారీ ప్రోత్సాహక బహుమతులు

నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలకు భారీ నగదు బహుమతులతో పాటు ఉత్తేజకరమైన బహుమతులు అందించనున్నారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.35 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.5 వేలు, జిల్లా స్థాయి విజేతలకు రూ.60వేలు, రూ.30వేలు, రూ.10వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షలు నగదు బహుమతి అందించనున్నారు. అలాగే షటిల్ బ్యాడ్మింటన్(డబుల్స్) పోటీలో నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్టుకు రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతలకు రూ.35వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.2లక్షలు, రూ. లక్ష, రూ.50 వేలు అందించనున్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ఈ పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా సామగ్రిని తిరుపతి జిల్లాలోని 481 గ్రామ సచివాలయాలు, 210 మున్సిపల్ వార్డు సచివాలయాలకు సరఫరా చేశారు. వార్డు/సచివాలయ స్థాయి, మండల స్థాయి పోటీలకు సంబంధించి ప్రాథమిక స్థాయి(స్టేజ్ 1), నియోజకవర్గ స్థాయికి సంబంధించి ప్రొఫెషనల్(స్టేజ్-2) కిట్లు అందించారు. ఇందులో భాగంగా ఒక్కో వార్డు/సచివాలయానికి 3 క్రికెట్ కిట్లు, వాలీబాల్‌కు సంబంధించి ఒక నెట్, 3 బాల్స్, షటిల్‌కు సంబంధించి 6 రాకెట్లు (షటిల్ బ్యాట్లు), 6బాక్సుల కాకులు అందించారు. అలాగే నియోజకవర్గ స్థాయికి సంబంధించి ప్రొఫెషనల్ కిట్లు అందించారు. ఇందులో 3 క్రికెట్ కిట్లు, 4 వాలీ బాల్స్, 8 షటిల్ రాకెట్స్, 12ఫెదర్ కాక్ బాక్సులు అందించారు. వీటితో పాటు 1,382 టెన్నికాయిట్‌లను అందజేశారు. నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన కబడ్డీ, ఖోఖో జట్లుకు 50 యాంక్లెట్‌లను అందించనున్నారు. అలాగే టీషర్టులు, క్యాప్‌లు అందించనున్నారు.

15 ఏళ్లపైబడిన వారు అర్హులు

ఈ పోటీలకు క్రీడాకారులే కాకుండా 15 ఏళ్లు పైబడిన ఔత్సాహికులైన స్త్రీ, పురుషులందరూ పాల్గొనవచ్చు. ఇప్పటి వరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా పురుషులు 89,057 మంది, మహిళలు 61,223 మంది, మొత్తం 1,50280 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. ఆసక్తి ఉన్న వారు ×ఏపీడీయూడీపీఎంఏఎస్‌డీహెచ్‌ఆర్‌ఏ.ఏపీ.జీటీవీ.ఇన్₹ వెబ్‌సైట్ ద్వారా, అలాగే 1902కి కాల్ చేయడం ద్వారా, అలాగే సమీపంలోని సచివాలయంలో పేర్లను నమోదు చేసుకోవచ్చు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలను నిర్వహించనున్నారు.

విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు

నియోజకవర్గ స్థాయి నుంచి అన్ని క్రీడల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన జట్ల సభ్యులకు పతకాలు, సర్టిఫికెట్లు అందించనున్నారు. ఇందులో భాగంగా ఐదు ఈవెంట్లలో కలిపి మొదటి స్థానం సాధించిన వారికి 114 బంగారు, ద్వితీయ స్థానానికి 114 వెండి, తృతీయ స్థానానికి 114 కాంస్య పతకాలు, సర్టిఫికెట్లతో పాటు ఆయా జట్లుకు ట్రోఫీలను అందించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి



ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాం. ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా సంబరాలను సీఎం ప్రారంభించనున్నారు. 15ఏళ్ల పైబడ్డ ప్రతి మహిళ, పురుషులు పాల్గొనవచ్చు.

- కె.వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్, తిరుపతి

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర మెగా క్రీడా సంబరాలను గ్రామ సచివాలయ/వార్డు స్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు, అలాగే పీడీ, పీఈటీ, క్రీడల అధికారుల వరకు అందరి సహకారంతో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశాం. ఏయే ఈవెంట్లను ఎక్కడ నిర్వహించాలన్న ప్రణాళికను సిద్ధం చేసుకున్నాం.

- ఎస్.సయ్యద్ సాహెబ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, తిరుపతి

జనరంజకంగా నాటక, నృత్య ప్రదర్శనలు



ఎన్‌టీఆర్ పురస్కారంతో కళాకారిణిని సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ఎస్‌ఆర్ నాట్య కళాపరిషత్ 60వ వార్షిక కళోత్సవాల్లో భాగంగా జాతీయస్థాయి నాటక, నృత్య పోటీలలో భాగంగా నాలుగో రోజు గురువారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన సాంఘిక, పౌరాణిక నాటికలు, నృత్యాలు జనరంజకంగా సాగుతూ సభికులను అలరింపజేశాయి. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన అసరసాల సాంఘిక నాటిక ఆకట్టుకుంది. అనంతరం నిడుబ్రోలు రసఝురి పొన్నూరు వారి కాపలా సాంఘిక నాటక ప్రదర్శించారు. అనంతరం శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి వారు ప్రదర్శించిన బాలనాగమ్మ పద్యనాటకం పౌరాణిక గొప్పతనాన్ని చాటింది. అనంతరం శాస్త్రీయ నృత్య పోటీలలో చిన్నారి కళాకారులు నృత్యాభినయంతో సభికులను ఆకట్టుకున్నారు. అనంతరం ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు కళాకారులకు నగదు పారితోషికం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాటక రంగానికి విశేష సేవలు అందిస్తున్న కళాకారులకు ఉత్తమ నటీ నటులుగా ఎన్‌టీఆర్ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఆమూరి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల క్రికెట్ విజేత కలికిరి సీకాం



చాంపియన్ ట్రోఫీని అందజేస్తున్న రిజిస్ట్రార్ హుస్సేన్, శివశంకర్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ అంతర్ కళాశాలల ఓవరాల్ క్రికెట్ చాంపియన్‌గా కలికిరి సీకాం డిగ్రీ కళాశాల నిలిచింది. మూడు రోజులుగా ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియం వేదికగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఎస్వీయూ పరిధిలోని 12 కళాశాలలకు చెందిన క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల, కలికిరి సీకాం కళాశాల తలపడ్డాయి. ఇందులో కలికిరి సీకాం విద్యాసంస్థ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవానికి వర్సిటీ రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజేతలకు చాంపియన్ ట్రోఫీతోపాటు ధ్రువపత్రాలను అందజేశారు. టోర్నమెంట్‌లో పాల్గొని, విజేతలుగా నిలిచిన జట్టును ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

జనవరి 6, 7 తేదీల్లో త్యాగరాజ సంగీతోత్సవాలు

తిరుపతి కల్చరల్: తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జనవరి 6, 7వ తేదీల్లో రామచంద్రపుష్కరిణి వేదికగా త్యాగరాజ స్వామివారి సంగీత మహోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు నిర్వాహకులు గురువారం వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తితో త్యాగరాజ సంగీతోత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శ్రీరామచంద్రుని తన కీర్తనలతో ధ్యానించిన మహా భక్తుడు సద్గురు త్యాగరాజ స్వామి అని తెలిపారు. త్యాగరాజ స్వామి సంగీత ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, వీఎస్.బాలచంద్ర, గోవింద శెట్టి, రావిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, అపోలో చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే పరిణికారెడ్డి, ఎమ్మెల్సీ రఘురాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: ఓ వ్యక్తి ఇంట్లో భార్యతో గొడవపడి మనస్తాపానికి గురై మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. మన్యం జిల్లా, సాలూరుకు చెందిన చిగురుకోట ఉపేంద్రకుమార్ (52) భార్యతో గొడవపడి మంగళవారం ఉదయం తిరుపతికి చేరుకున్నాడు. తిరుపతిలోని పెద్ద కాపు లే అవుట్‌లోని హరికిరణ్ లాడ్జీలో శ్రీవారి దర్శనానికి వచ్చానని చెప్పి ఓ రూము తీసుకున్నాడు. మంగళవారం రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. అతని దగ్గర ఉన్న ఆధారాల మేరకు కుటుంబీకులకు సమాచారం అందించారు. తర్వాత వారి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

భార్యే హంతకురాలు

- ప్రియుడుతో కలిసి భర్తను హత్య చేసిన వైనం
- లవ్ ఎఫైర్ వల్లే ఈ ఘాతుకం
- హంతకులు అరెస్ట్
- చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్



మాట్లాడుతున్న చంద్రగిరి డిఎస్పీ యశ్వంత్, సీఐ సుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, చిగురువాడలో ఈ నెల15న అనుమానాస్పదంగా మృతి చెందిన గోవిందు(30) డెత్ మిస్టరీని తిరుపతి రూరల్ పోలీసులు ఛేదించారు. గోవిందు హత్యకు గురైనట్లు నిర్ధారించారు. భార్యే హంతకురాలుగా విచారణలో తేలింది. ప్రేమ వ్యవహరమే దీనికి కారణంగా గుర్తించారు. నిందితులు మానస, సింహాద్రిని గురువారం రామానుజపల్లి సర్కిల్ వద్ద అరెస్ట్ చేశారు. అనంతరం చంద్రగిరి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ యశ్వంత్, రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఐ నాగేంద్రబాబు విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. వారి కథనం.. చిగురువాడ వైఎస్సార్ కాలనీలో నివాసం ఉండే గోవిందు మూడు నెలల క్రితం సదుం మండలానికి చెందిన సోంపల్లి మానసను పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. అంతకుముందే మానస డిగ్రీ చదివే సమయంలో మదనపల్లికి చెందిన పలాసి సింహాద్రిని ప్రేమించింది. మూడేళ్ల పాటు వీరి ప్రేమాయణం సాగింది. ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులు గోవిందుకు ఇచ్చి పెళ్లి చేయడంతో ప్రియుడితో రహస్యంగా కలుస్తుండేది. తమ ప్రేమకు అడ్డుగా ఉన్న భర్తను వదిలించుకోవాలని మానస ప్రణాళిక రూపొందించి. అందులో భాగంగా ఈనెల 15న ప్రియుడు సింహాద్రిని చిగురువాడకు పిలిపించింది. అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భర్త గోవిందును ప్రియుడుతో కలిసి గొంతు పిసికి చంపేసింది. హత్య చేసిన తర్వాత సహజ మరణంగా నమ్మించేందుకు ప్రయత్నించారు. అయితే మృతుడి గొంతు, మెడపైన గాయాలు ఉండడంతో బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. తిరుపతి రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ నాగేంద్రబాబు పూర్తిస్థాయిలో విచారించి ప్రియుడుతో కలిసి భార్యే హత్య చేసినట్లు ఆధారాలు సేకరించినట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన సీఐ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఐ నాగేంద్రబాబును ఆయన అభినందించారు.



అరెస్ట్ అయిన నిందితులు

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్‌డే

తిరుపతి కల్చరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా నిర్వహించనున్న గ్రీవెన్స్‌డేని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కోటేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు 22వ తేదీ శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్‌డేను నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

ఎస్ఐ పోస్టుకు ఎంపికైన కానిస్టేబుల్



ఎస్ఐ పోస్టుకు ఎంపికైన సుధీర్‌రెడ్డి

పెళ్లకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పీ.సుధీర్‌రెడ్డి గురువారం వెలువడిన ఎస్ఐ పరీక్షా ఫలితాల్లో ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యారు. అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు మండలం, తెలుగి గ్రామానికి చెందిన గాలి మద్దిలేటిరెడ్డి, సావిత్రమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చిన్న కుమారుడు సుధీర్‌రెడ్డి పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. సుధీర్‌రెడ్డి పెద్దన్న లక్ష్మీరెడ్డి గుత్తి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. చిన్నతనం నుంచి ఎస్ఐ కావాలనే లక్ష్యంతో సుధీర్‌రెడ్డి చదువు కొనసాగించాడు. 2019 డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతుండగా ఎస్ఐ నోటిఫికేషన్ విడుదల అయ్యింది. డిగ్రీ చదువుకుంటూనే 2020లో గ్రౌండ్ టెస్ట్‌లో ఎంపికయ్యాడు. 2023 అక్టోబర్‌లో జరిగిన ఎస్ఐ రాత పరీక్ష ఫలితాలు ఈ నెల 21వ తేదీన విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో సుధీర్‌రెడ్డి రాయలసీమ జోన్‌లో 8వ ర్యాంక్ సాధించి, ఎస్ఐగా ఎంపికయ్యాడు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్, స్టేషన్ సిబ్బంది సుధీర్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

నాయుడుపేట: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఎన్నికలు పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి పోలా భాస్కర్ తెలిపారు. నాయుడుపేట మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం మండల రెవెన్యూ అధికారులు, పోలింగ్ బూత్ అధికారులుతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఉండాలని, ఈ విషయంలో పోలింగ్ బూత్ అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్పులు చేర్పులు, తొలగింపులకు సంబంధించిన క్లైమ్‌లు సరైన పద్ధతిలో జరుగుతున్నాయా? లేదా అని నివేదికలను పరిశీలించారు.

వైకుంఠ ఏకాదశి వేడుకల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని శెట్టిపల్లి వద్దనున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 23వ తేదీ జరుగనున్న వైకుంఠ ఏకాదశి వేడుకల కరపత్రాలను ఆలయ చైర్మన్ భీమాస్ అశోక్, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, భాగవతులు రామనాథం గురువారం ఓ ప్రైవేటు హోటల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి నాడు స్వామి అమ్మవార్లను ప్రత్యేక అలంకరణతో వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే రోజు ఆలయం వద్ద అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో సంగీత కచేరీ, హరికథా గానం, ఎస్వీ మ్యూజిక్ కళాశాల వారి భక్తి సంకీర్తనల విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ పాల్గొని స్వామి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

కొలకలూరి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: గత 16ఏళ్లుగా కొలకలూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో కొలకలూరి సాహిత్య పురస్కారాలను పలు విభాగాలలో అత్యంత ఆదరణ పొందిన సాహిత్య రచయితలకు అందిస్తున్నామని కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి సుమకిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 2024 సంవత్సరానికి ఈ పురస్కారాలను అందించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ కథానికానికి కొలకలూరి భాగీరథి పురస్కారం, ఉత్తమ నవలకు కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారం, ఉత్తమ విమర్శకులకు కొలకలూరి రామయ్య పురస్కారం, రూ.15వేల నగదు బహుమతిని అందించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 15లోపు ఆసక్తిగల రచయితలు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన ఉత్తమ నవలా రచయితలకు ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో జరిగే పురస్కార సభలో బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. కథలు, నవలలు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, తెలుగు శాఖ అధ్యక్షుడు, పద్మావతీ మహిళా వర్సిటీ, తిరుపతి జిల్లా, 517502 అనే చిరునామాకు పంపించాలని కోరారు. విమర్శన రచనలను ఆచార్య కొలకలూరి సుమకిరణ్, ఆంగ్లశాఖ అధ్యక్షుడు, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి 517502 అను చిరునామాకు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 94419 23172, 99635 64664 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భూదేవి కాంప్లెక్స్ వద్ద నిరీక్షిస్తున్న భక్తులు





వైకుంఠ రద్దీ

తిరుమల వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుపతిలోని కౌంటర్ల వద్ద గురువారం రాత్రి నుంచే టిక్కెట్ల కోసం బారులు తీరారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో టీటీడీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఎక్కడా తోపులాటలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. - సాక్షి, తిరుపతి